# లోభి

పూడిపెద్ది శేషశర్మ

మాశ్రీవారికి బదిలీకావడంవల్ల ఇరవైఏళ్లుగా ఉంటున్న చికాగోనగరం వదిలి అలబామాలోని బర్మింగ్‌హామ్ నగరంలో స్థిరపడ్డాం. బాగాఅలవాటయిన ఊరువల్ల, చికాగోనిమట్టుకు మరిచిపోలేకపోతున్నాం. ఈ వూరొచ్చి ఆరునెలలు కావచ్చినా, మా పాతఇల్లూ, పాతస్నేహితులూ, మామాటల్లో మాఆలోచనల్లో, తరుచూ మెదులుతూనే ఉన్నారు. ఎవరో అమెరికన్ ఫ్రెండ్ చెప్పినట్టు ఫార్ములా ఫామిలీ మాది. అంటే ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. అమ్మాయి పెద్దది. ఇంకో రెండు నెలల్లో పాతిక సంవత్సరాలు నిండుతాయి. మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్‌చేసి హ్యూస్టన్‌లో ఉద్యోగంలో చేరి ఒక సంవత్సరం కాబోతోంది. అక్కడ తనతో పనిచేసే ఒక తెల్ల కుర్రవాడిని పెళ్లి చేసుకుంటానంటే, మా మనసులో ఒక కలతరేగినా పైకి కనబడ నీయకుండా నేనూ, శ్రీవారు ఒప్పుకున్నాం. ఒప్పుకోక చేసేదేముంది చెప్పండి. మనం అయితే అమ్మా, నాన్నల మాటమీద వాళ్లకి నచ్చిన సంబంధం తెస్తే, కుక్కిన పేనులా పెళ్లి చేసుకుని కాపురాలు చేస్తున్నాం. ఒకరి భావాలతో ఇంకొకరివి ఏకీభవించక పోయినా, ఎటువంటి మనస్పర్థలు కలిగినా ఎలాగో ఎవరో ఒకరు సర్దుకుపోతూ, బతికేస్తున్నాం. కాని ఈ పాశ్చాత్య దేశాల్లో పెరుగుతున్న పిల్లల్ని, మనం మనకి నచ్చిన సాంప్రదాయానికి చెందిన కుర్రాణ్ణో, కుర్రదాన్నో తెచ్చి, కొద్దిరోజులు పరిచయంతో భార్యాభర్తలుగా అయిపోమనడం సమంజసం కాదేమోనని నాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. ఆమాటే మాశ్రీవారితో చెప్పి, ఆయనేమీ గొడవ చేయకుండా మాసీతకి పెళ్లి ఒప్పించాను. ముప్ఫయి ఏళ్లు దాటినా ఇంకా పెళ్లి సంగతి ఎత్తనివాళ్లూ, పెళ్లంటూ లేకుండానే పిల్లల్ని కనేవాళ్లూ, మగవాళ్లతోనే కాపురంచేసే మగవాళ్లూ, అదేకోవకి చెందిన ఆడవాళ్లూ అపరిమితంగా ఉండే ఈదేశంలో, ఈకాలంలో పాతికేళ్లు దాటకుండానే ఓ ఇంటిదాన్ని అవుతాన్న మాఅమ్మాయిని ప్రశంసించకుండా ఉండలేక పోయాను. దానికితోడు రాబర్టు మంచి హృదయం, సహనం కల కుర్రవాడు. చీదితే ఊడిపోయే ముక్కులాంటివి ఈ నాటి పెళ్లిళ్లూ, సంసారాలూ. అలాంటప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకో లేకపోతే ఇక ఆ సంసారానికి తిలోదకాలు ఇచ్చివేయవలసిందే. సీతది, రాబర్టుది ఒకే రకమైన మనస్తత్వం. దానికితోడూ రాబర్టుకి చెప్పలేనంత సహనం, ఓర్పు అవన్నీ చూసేసరికి, మరోమాట మాట్లాడకుండా మూడునెలలక్రితం పిట్సుబర్గ్‌లో పెళ్లి చేశాం.

మారెండో సంతానం సురేష్. ఏడేళ్ల మెడిసిన్ ప్రోగ్రామ్‌లో నాలుగో ఏడు చదువుతున్నాడు. మావాడివి అన్నీ వాళ్ల నాన్నలాగ పాతచింతకాయ పచ్చడి భావాలే. నాలాగ ఇంట్లో ఉండి, వంటచేసి, ఫామిలీని చూసుకునే తెలుగు అమ్మాయినే చేసుకుంటానంటాడు. మరి, పులిహోర, సాంబారు, గడ్డపెరుగు, నెయ్యి, గోంగూరపచ్చడి, మిరపళ్ల పచ్చడి చేయమంటే, ఏ అమెరికన్ చేస్తుందీ! అందుకే ఇండియావెళ్లి, మన ఆంధ్రదేశంలో పుట్టిపెరిగిన అమ్మాయినే చేసుకుంటాడట!

చెప్పొచ్చిందేమిటంటే, నా పిల్లలిద్దరూ ఇల్లువదలి వెళ్లి నాలుగేళ్లపైన అయిందేమో, నాకు ఇంట్లోకూర్చుని, సోపొపెరాలు చూడడం విసుగేసి, సంఘసేవ మొదలెట్టా. ఉదయాన్నే, కళ్లుమూతలు పడిపోతున్నా, ఉరుకులు, పరుగులతో పనికి పరుగెట్టి, సాయంత్రం చీకటి పడిన తరువాత కాళ్లీడ్చుకుంటూ ఇంటికిచేరి, ఏవారాని కొకసారో వండి, ఫ్రిజర్‌లో పడేసిన కూరలూ, పప్పూ వేడిచేసుకొని తినే వెధవ బ్రతుకెందు కంటారు మాశ్రీవారు. పాతికేళ్ల క్రితవే పెద్దయూనివర్సిటీలో ఎమ్.ఎ. చదువుకుని, స్వాతంత్ర్యభావాలు కలదాన్నయినా, ఆవిషయంలో మాత్రం ఆయనతో ఏకీభవించకుండా ఉండలేకపోయాను. ఇరవై ఏళ్లు ఇంట్లోనే ఉండి పిల్లల్ని చూసుకోవడం అలవాటయిన నాకు నలభై అయిదేళ్ల వయస్సులో తల అమ్ముకోవాలసిన అవసరం ఏముంద నిపించింది.

చిన్నప్పుడు హైస్కూల్లో, తరువాత కాలేజీలో రాజకీయాల్లో పాల్గొనడం, మనస్సులోని మాట నిక్కచ్చిగా చెప్పడం నాకు బాగా అలవాటు. స్వతహాగా ఈ సంఘం ఆ సంఘం అంటూ అన్నింటిలోనూ వేలుపెట్టే మనస్తత్వం నాది. ఈ దేశం వచ్చిన కొత్తలో, చుట్టు పక్కల ఇంకా తెలుగు వారెవరున్నారా? అని తెలుగు వాళ్లకోసం మొహం వాచిపోయినట్టుగా అందరితో స్నేహాలు చేసేసుకొని, అందరం ఓ కుటుంబంగా మెరిసే వాళ్లం. ఈ ఇరవై సంవత్సరాల్లో, కొత్తతరం వాళ్లు తండోప తండాలుగా ఈ దేశం వస్తున్నా, ఇతరులతో ప్రమేయం లేకుండా ఎవ్వరితో సంబంధంలేకుండా ఎవరిత్రోవన వాళ్లు పోతున్నారు. ఏ ప్రోగ్రామయినా, పనిచేసేవాళ్లు నాలాంటి పాతవాళ్లేగాని, కొత్త తరంవాళ్లు కనిపించడం అరుదు. చికాగోలో ఉన్నన్నాళ్లు అక్కడ తెలుగు సంఘానికో, టెంపుల్ కమిటీలోనో, పనిచేయడం బాగా అలవాటయిపోయింది నాకు. పోనీ ఈ వూరు వచ్చేంకదా! నిర్వాహకులుగా కాకుండా ప్రేక్షకుల్లా, అందరి మధ్యలో కూర్చుని, అన్నీ చూడవచ్చు అని అనుకున్నా. కాని వచ్చిన రెండునెలలకే మా ఇండియా అసోసియేషన్‌కి మీరు ట్రెజరర్‌గా ఉండరా అని తెలిసిన వాళ్లంతా వత్తిడి చేయడంతో, ఆ పదవిని అలంకరించక తప్పలేదు. ఒక పని నెత్తిన వేసుకుంటే, పగలూ, రాత్రీ, అదే అలోచనతో పనిచేసే మనస్తత్వం నాది. పోన్లే, కుటుంబ బాధ్యతలన్నీ తీర్చేసుకొని, చేతులు దులిపేసుకున్న నాలాంటి వాళ్లు కాకపోతే ఇంకెవరు చేస్తారని, నన్ను నేనే సమాధాన పరచుకొని కార్యరంగంలోకి దిగా. మా ఇండియా అసోసియేషన్ మెంబరుషిప్ ఫీజ్ పాతిక డాలర్లు మాత్రమే. కాని చాలామంది ఇండియన్స్ మా అసోసియేషన్ మెంబర్లు కారు. ఈవూళ్లో ఎంతమంది ఇండియన్సు ఉన్నారో. అందులో కనీసం ఏభైశాతం అయినా మెంబర్సుగా చేయాలని నా ఆశయం. రెండు నెలలు పగలూ, రాత్రి, విసుగులేని విక్రమార్కుడిలా టెలిఫోన్ డైరక్టరీలో, ఇండియాపేరు కనిపిస్తేచాలు, వాళ్లకి ఫోన్‌చేసి మెంబర్సుగా చెయటానికి ఉపక్రమించా. అది కాస్తా మహాయజ్ఞమై కూర్చుంది. అదేమిటో మనవాళ్ల మనస్తత్వాలు మహా విచిత్రం సుమండీ! వేలకి వేలు బట్టలమీద, ట్రిప్పులమీద, రెస్టారాంటులమీద పెట్టడానికి క్షణమైనా వెనుకాడరు. కాని మన ఇండియాకి సంబంధించిన దేనికైనా పది డాలర్లు ఇవ్వమంటే మళ్లీ కనిపించరు మనకి. ఒకవేళ ఇచ్చినా, ఆ పది డాలర్లు మనమొహం మీద పారెయ్యడానికి మనని ముప్ప తిప్పలు పెట్టి, మూడు చెరువుల నీళ్లు తాగిస్తారు. అదే కాదు, ఏ కార్యానికైనా విరాళం అంటే అదేదో వినకూడని మాట విన్నట్టు మొహంపెడతారు. ఏ చిరంజీవో, శ్రీదేవో వచ్చారనుకోండి, వందలకు వందలు డాలర్లు పోసి వాళ్లని చూడ్డానికి ఎగబడి పోతారు. అదే ఏ టెంపుల్‌కో, లేక మరో మంచి కార్యానికో చందా అడగండి, వాళ్లకి మనం శత్రువులమయి పోయినట్టే!

దేవిగారని, ఒక తెలుగావిడ గత పదిహేను సంవత్సరాలుగా బర్మింగ్‌హామ్‌లో ఉన్నారు. ఆవిడకి తెలియని భారతీయుడు ఈ ఊళ్లో లేడంటే, అది అతిశయోక్తి కాదు. అందరి వ్యక్తిత్వాలని, మనస్తత్వాలని కడిగిన అద్దంలో చూసినట్టు గ్రహిస్తుందా ఇల్లాలు. ఆవిడతో మాట్లాడితే, ఎవరిని ఎలా అడగాలో, ఎవరిని అడగవచ్చో, అడగకూడదో తెలుస్తుందని, ఆవిడకి ఒకరోజు ఫోన్‌చేశా.

''వసుంధరగారూ, నేను ముక్కుకి సూటిగా పోయే మనిషి నండోయ్. ఎవ్వరేమనుకుంటే అనుక్కున్నారు; ఉన్నది ఉన్నట్టుగా కర్రవిరిచి చేతిలో పెట్టినట్లు చెప్పే మనిషినండీ నేను. మీరెన్ని చెప్పండి ఈ ఊళ్లో, మనవాళ్లల్లో, డాక్టరు నాయుడుగారు, ప్రకాశరెడ్డిగారు, నరసింహశాస్త్రిగారు, ఎటువంటి సహాయానికైనా వెనుదీయకుండా ముందుకు వచ్చేవారు. ఇక మిగతా వాళ్లున్నారా, వాళ్లదయ మీప్రాప్తి; వాళ్లలోచాలామందిని మన అసోసియేషన్ మెంబర్లు చేయాలని మేము చాలాసార్లు పాట్లు పడ్డామండోయ్. కాని ఏదో కవి చెప్పినట్లు, ఇసుకలో తైలం తీయవచ్చు ఎడారిలో నుయ్యి తవ్వవచ్చు కాని, ఈ ఊళ్లోకొందరి దగ్గరనుండి ఓ డైమైనా మీరు రాబట్టలేరు. నేనిలా సంకోచం లేకుండా చెప్పుతున్నానని ఏమనుకోకండికాని, అలాంటివాళ్లలో అగ్రగణ్యుడు గుప్తాగారండీ'' అంది సాగతీస్తూ దేవి.

''ఏ గుప్తా గారూ, అ మిలియనీర్ రమేష్‌గుప్తాగారా?'' అన్నా కుతూహలంగా.

''ఆఁహాఁ పదహారణాల అచ్చం మనతెలుగువాడే. వెయ్యి మంది ఆయన కొంపమీద పడి ఏళ్ల తరబడి తిన్నా, తరగని ఆస్థి ఆయనిది. కంప్యూటర్ బిజినెస్‌లో లక్షలకు లక్షలు సంపాదించాడు. ఆయనతో సరిగ్గా తూగుతూ ఆయన భార్యారత్నం. రియలెస్టేట్‌లో లక్షలకు లక్షలు సంపాదించింది. ఉన్నవారికే అన్ని సుఖాలూ అన్నట్టు వాళ్లపిల్లలిద్దరూ ఆణిముత్యాలు. వాళ్ల తెలివితేటల వల్ల చదువుకి పైసా అయినా ఖర్చుపెట్టలేదు ఆ మహానుభావుడు. మల్టీ మిలియన్ డాలర్ ఎస్టేట్ ఆయనది. అంత ఉన్నా, ఎప్పుడూఎవ్వరికీ ఓ డాలరియ్యడం చూడలేదు. ఎన్నడూ ఏ ప్రోగ్రాంకీ రాడు. ఎవ్వరినీ పంపడు. మనందరి మధ్యకీ వస్తే ఆయన ఐశ్వర్యం తరుక్కు పోతుందేమోనని భయమో ఏమిటో మరి. అంతటి పరమలోభిని నా జీవితంలో నేను చూడలేదు సుమండీ! మీరు ఆయన దగ్గరనుండి మెంబర్‌షిప్ ఫీజు పాతిక డాలర్లు కాదు కదా పాతిక సెంట్లు కూడా రాబట్టలేరని నేను పందెం కడతాను.'' అంది దేవి ధీమాగా.

ఆవిడ అంత ఖండితంగా చెప్తూంటే ఆయనని ఫోన్‌చేసి, ఉట్టి చేయి చూపించు కోవడ మెందుకని, ఆయన్ని అడగడం విరమించు కున్నాను.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే ఒకవారం క్రితం మాప్రెసిడెంట్‌గారు ఫోన్‌చేసి, ''వసుంధరగారూ, మహారాష్ట్రంలోని భూకంపంలో నష్టపోయిన వాళ్లకు మన అసోషియేషన్ తరపున సహాయంచేయాలండీ. ఎంతోకొంత చందా వసూల్‌చేసి రామకృష్ణామిషన్‌కి పంపిద్దామని ఉంది నాకు, ఏమంటారు?'' అన్నాడు.

నిజమే మనమంతా తిండికీ, బట్టకూ, ఏవిధమయిన కష్టంలేకుండా సుఖంగా బతికేస్తున్నాం ఈ దేశంలో. మనదేశంలో కష్టాలు పడుతున్న తోటి మానవుడికి సహాయార్థం ఎంతోకొంత డబ్బు పంపితే మంచిదే. ఎలాగో కష్టపడి ఐదువేలడాల్లర్లు పోగుచేస్తే బాగుంటుందని అనిపించింది. ఆ సంగతే ఆయనకు చెప్పా. అంతే ఆబాధ్యత కాస్తా నా భుజాల మీద పడింది. సరే, నిండా మునిగిన వాడికి చలేమిటని, అడిగిన వాళ్లనే మళ్లా అడిగి, ఇచ్చిన వాళ్లదగ్గర తీసుకొని, నచ్చని వాళ్లచేత అక్షతలు వేయించుకొని మొత్తం రెండువేల ఎనిమిదివందల డాలర్లు సంపాదించా. నా గోల్ ప్రకారం ఇంకా రెండువేల రెండువందల డాలర్లు సంపాదించాలి. అడగ దలచుకున్న వాళ్లనందరినీ అడిగేశాను. ఇంకెవరున్నారబ్బా! అని ఆలోచిస్తూ కూర్చున్నా. అప్పుడు చటుక్కున గుర్తుకొచ్చారు గుప్తాగారు. ఆయన పరమలోభి అని ఒకరు కాదు, చాలామంది చెప్పారు. అలాంటిది ఆయన్ని అడిగి లేదనిపించుకోవడం ఎందుకు? ఒకవేళ ఆయన ఏ పదో పాతికో ఇచ్చి దానివల్ల ఏమిటి ఫలితం? ఎందుకులే అనుకున్నా కాని ఎందుకో మనస్సు ఉండబట్టలేదు. కష్టపడి ఎలాగో ఆయన ఫోన్‌నంబర్ సంపాదించి ఆయనకు ఫోన్‌చేశాను.

''హల్లో, గుప్తా స్పీకింగ్'' అని వినిపించింది అవతలి గొంతు.

''నమస్కారం గుప్తాగారూ, నా పేరు వసుంధర. నేను ఇండియా అసోసియేషన్‌కి ట్రెజరర్‌ని. ఈ ఊళ్లో గత ఆరునెలలుగా ఉంటున్నాము. మీ గురించి చాలా విన్నాను. మీతో చిన్న పనుండి ఫోన్ చేశాను.'' అన్నాను నీళ్లు నములుతున్న దానిలా.

''చెప్పండి'', ముభావంగా అనిపించింది అవతలిగొంతు.

''మరేం, మహారాష్ట్రంలో భూకంపం వచ్చి, చాలాగ్రామాలు కూలిపోయాయి కదండీ! వారికి సహాయార్థం విరాళాలు సేకరిస్తున్నాం. మొత్తం అయిదువేల డాలర్లు కలెక్టచేసి చికాగోలోని రామక్రిష్ణామిషన్ బ్రాంచికి పంపుదామని. కాని ప్రస్తుతానికి రెండువేల ఎనిమిది వందలు మాత్రమే దొరికాయి. మీరుకూడా ఏమైనా .....''

''డబ్బులు కావాలంటారు. అంతేనా. ప్రతివాడూ దీనికంటూ దానికంటూ చందాలు వసూలు చేయడమే. చందాలంటూ ప్రోగు చేసిందంతా వాళ్ల ఖర్చులకే చాలదు. ఒక డాలరిస్తే అందులో పదిసెంట్లు ముఖ్యవ్యక్తులకి చేరితే గొప్ప. సరే రేపు ఉదయం 8.15 కి రండి చూస్తాను.'' అని వాళ్లింటికి గబగబా డైరక్షన్స్ ఇచ్చి దభాలున ఫోన్ పెట్టేశాడు ఆయన. నాకు చిర్రెత్తుకొచ్చింది ఆ క్షణంలో. అంత మర్యాద లేకుండా ఎలా ఉన్నాడబ్బా! వెధవ డబ్బు ఉంటేనేం, లేకపోతేనేం, అవతలమనిషికి గౌరవం ఇవ్వలేనివాడు మనుష్యుల మధ్యలో ఎలా బ్రతుకుతున్నాడు? ఈయనకి ఓ దండం! ఇయన డబ్బుకి ఓ దండం. మళ్లీ ఈయన జోలికి పోకూడదనుకున్నా.

* * *

మర్నాడు ఉదయం ఏడయింది. లేచిన వెంటనే ఆ గుప్తాగారిని కలవాలన్న పట్టుదల ఎక్కువయింది నాలో. మనిషి మొహం ముందు ఎలా మాట్లాడతాడో చూడాలి. డబ్బు ఇస్తే ఇచ్చేడు. ఏ మాత్రం అగౌరవంగా మాట్లాడేడా, ఆ డబ్బు ఆ మొహంమీద తిప్పికొట్టి, వెనక్కి వచ్చెయ్యాలి అని నిశ్చయించుకున్నా! గుప్తాగారి ఇంటికెళ్లే సరికి 8:10 అయింది. దేవేంద్రభవనంలా ఉంది ఆ ఇల్లు. చుట్టూ ప్రహారీగోడ, ముందు పెద్ద ఇనుపగజాల గేటు, వెనకాల చిన్న సెలయేరు. గొప్ప ఆహ్లాదకరంగా ఉన్నాయా పరిసరాలు. ఒక ప్రక్కగా కూరగాయల తోట ఉంది. చిక్కుడుకాయలు, వంకాయలు, బెండకాయలు విరివిగా కాసి ఉన్నాయి. గోంగూర దట్టంగా పెరిగి ఉంది. పెద్ద పెద్ద గోలేలలో కరివేపాకు మొక్కలున్నాయి. ఈ మానవుడు డబ్బుపెట్టి కూరగాయలు కొనడులా ఉంది. ఇంత ధనవంతుడయి కూడా ఏమిటో డబ్బుమీద వ్యామోహం. పిసినారితనంకైనా ఒక హద్దు ఉండాలి. ఎప్పుడూ ఆయన గురించి నా మెదడులో కలగని జుగుప్స తొంగిచూడడం నేను గమనించా. సరే, వేగంగా పని ముగించుకొని ఇంటికి బయలుదేరదామని, డోర్‌బెల్ నొక్కా. ఒకటి,

రెండు నిముషాల తరువాత తలుపు తెరిచాడో మధ్యవయస్కుడు. పట్టుపంచ, భుజంమీద తుండుగుడ్డ, మెళ్లో రుద్రాక్షమాల, నుదుటిన విభూది రేఖలు, మధ్యకుంకమ, శంకరాభరణం శంకరశాస్త్రిగారు గుర్తుకొచ్చారు.

"నమస్కారం గుప్తాగారూ, నేను వసుంధరని" అన్నా చేతులు జోడిస్తూ!

"లోపలికి రండమ్మా" తీక్షణమైన ఆచూపు, ఆ గంభీరత ఒక రకంగా నన్ను ఆకర్షించాయి. ఆయన వెనకే అడుగుపెట్టా లోపలికి. మయసభనే కాళ్లదన్నేటట్టుగా ఉంది ఆ భవనం. ఎడం ప్రక్కనున్న ఓ విశాలమైన గదిలోకి తీసుకెళ్లాడాయన. గది గోడలనిండా సత్యసాయిబాబా పటాలు వేలాడుతున్నాయి. చుట్టూ ఎత్తయిన బుక్ షెల్ఫ్‌లు, వాటినిండా వందలకొలది పుస్తకాలు అమర్చి ఉన్నాయి. ఓ మూలగా ఒక డెస్కు, రెండు కుర్చీలూ ఉన్నాయి. ఆ డెస్కు సొరుగులోంచి ఒక కవరు తీశాడాయన.

"ఇదిగో ఇది తీసుకోండి. నాకు టైమయింది. నేను బయటకు వెళ్లాలి. చిన్నమాట. మీరు నాదగ్గరికి వచ్చినట్టు ఎవ్వరికీ చెప్పకండి. ఈ విషయం మీకూ నాకూ తప్ప మూడోవాడికి తెలియకూడదు. ఉంటామరి నమస్తే" అని లోపలికి పోయాడాయన.

ఆయన విచిత్రమైన ప్రవర్తనకు ఏంచెయాలో తెలియక, బయటపడి కారు స్టార్ట్ చేశా. ఎవరికైనా తెలిస్తే మీదపడి చందాల డుగుతారేమోనని భయం కాబోలు ఈ మహానుభావుడికి. అలాంటప్పుడు తనని ఎందుకు రమ్మనాలి ఇక్కడికి, అనుకుంటూ సీల్‌చేసిఉన్న కవరుని చించా. అది చూడగానే నా మెదడు మొద్దుబారింది. నోటమాటరాక అచేతనంగా ఒక క్షణం అక్కడ కూర్చున్నా. ఆ కవరులో ఓ చెక్ రెండువేల రెండు వందలకు రాసి ఉంది. నా మనస్సులో లోభి అన్న పదం నన్ను వెక్కిరిస్తున్నట్టు నాట్యం చేస్తోంది. గుప్తాగారి దానం గుప్తదానం అన్నమాట. నీ కళ్లతో నువ్వుచూస్తేగాని ఏదీ నమ్మకు అని చిన్నప్పుడు అమ్మ చెప్పిన వాక్యం గుర్తు కొచ్చింది. ఆయన పిసినారితనం ఏమిటో అప్పుడు అర్థమయింది నాకు.

* * *

## స్నేహము

మనిషి కోరేది స్నేహము
స్నేహము కోరేది మంచి హృదయము
హృదయము ఆకట్టేది కనులు
కనులులోనికి దారిచూపేది మనోభావాలు
మనోభావాలలోతులు పూర్వజన్మ సుకృ-
తాలు
స్నేహము పూర్వజన్మసుకృతఫలం కాదా
మరి?
ఈ జన్మలోని స్నేహము జన్మజన్మల అను-
బంధమట
అనుబంధాల గుర్తింపు స్నేహమేనట
స్నేహానికి రూపులేదట రుచిలేదట
ప్రకృతి ఆస్వాదించేటంతటి తీయనిదట
స్నేహము
మనిషి కోరేది స్నేహము
స్నేహము కోరేది సచ్చిదానందము

— టి.యస్. లక్ష్మీ మోహన్
*Stillwater, OK*


**LAKSHMI VADAPALLI, M.D.**

Board Certified in Internal Medicine

* SPECIALIZING IN DIABETES *

New Patients Welcomed

Accept Co-Med, Medicare, Pru-Care, Aetna
Metlife

**(908) 821-0873**

**3084 Highway 27**
**Kendall Park, NJ 08824**

Call for Hours and Appointment
Weekend and Evening Hours Available

Full Color • High Quality • Budget Based

**Arangetram**

Invitations & Programs

*Each Uniquely Designed in consultations with the Guru, Parents and Disciple.*





**ACCU-PRINTS, Inc.**

**(609) 627-2228**